సర్వస్వం

[కథానిక]

శ్రీ వేలూరి సహజానందం

ఆఫీసుపనంతా ముగించుకొని బయలుదేరేటప్పటికి బాగా చీకటిపడ్డది. అత నివ్వాళ ఇంటి కెంత తొందరగా వెళ్లా లనుకొన్నాడో అంత ఆలస్యం అయింది. కింద గుమాస్తాలకు పని అప్పచెప్పి, కాగితాలపై నాలుగింటికల్లా సంతకాలు చేసి, త్వరగా ఆఫీసు నుంచి బైటపడా లనుకున్నాడు. కాని ఆఫీసులో తొందరపనులన్నీ ఇవ్వాళే తయారయినై. ఎలాగైతేం, బైటపడి కారులో బయలుదేరాడు. దార్లో ఏదో పెద్ద కొట్లోకి వెళ్లివచ్చి, కారు జోరుచేశాడు.

చుట్టూ ఆవరిస్తున్న అంధకారంలో శ్రీధరునికళ్ల ముందు ఉమ దీపరేఖలా ఉంది. దీపంచుట్టూ తిరిగే మిడతలాగా, ఉమయొక్క మనోహర ఉజ్వలరూపం చుట్టూ అతని పరిభ్రమణ ఎప్పటికప్పుడు కొత్తే. కాపురానికి వచ్చి మూడేళ్లయినా, ఉమ అత నెప్పుడూ ఒక కొత్త స్త్రీవలెనే ఆకర్షిస్తూ ఉంటుంది. ఈ సమ్మోహనపారవశ్యంలోనే అత నివ్వాళ ఎంతో ఉద్రేకంతో ఇంటికి వచ్చాడు.

స్నేహితురాండ్రతో ఉమ ఏదో చర్చిస్తోంది. చర్చలు తీవ్రంగా జరుగుతున్నయ్. శ్రీధరుడు బట్టలు మార్చుకొని, సావడిలోకి వచ్చాడు. కాని ఇంకా చర్చలు అంతూ పొంతూ లేకుండా సాగిపోతున్నయ్. ఒకటి రెండుసార్లు ఉమగదిముందు తచ్చర్లాడాడు. అయినా సంభాషణలు తగ్గలేదు. తన గదిలోకి వెళ్లి, కొనితెచ్చిన 'పాకెట్టు'ను తీసి, అలమరలో దాచాడు. ఉమతో కలసి హాయిగా 'బీచి'కి వెళ్లిరావా లనుకుని వచ్చాడు.

కాని ఉమ ఎప్పటిలాగానే తన ధ్యాసలో తాను మునిగివుంది. దారిలో అతను ఊహిస్తూనే ఉన్నాడు. తా నింటికి వచ్చేటప్పటికి ఏదో పుస్తకంతో తన్మయురాలై ఉంటుం దని. ఆ తన్మయత నాపి తాను షికారుకు తీసుకుపోగల ననుకున్నాడు. కాని ఇప్పుడు చుట్టూవున్న స్నేహితురాండ్ర పద్మవ్యూహాన్ని భేదించుకొని, ఉమహృదయాన్ని చేరటం అసాధ్యం అని అతనికి తెలుసు.

ఉమపై తీవ్రమైన క్రోధద్వేషాలు కలిగినయ్. ఒక్కొక్కప్పుడు తన్నెలా ఆకర్షణతో పరవశం చేస్తుందో, మరొక్కొక్కప్పుడు అంతకంటె ఎక్కువగా తనలో విద్వేషాన్ని రగుల్కొల్పుతూ వుంటుంది ఉమ.

అత నీ సంతోష క్రోధాలతోనూ, ప్రేమద్వేషాలతోనూ తప్తహృదయుడై ఆక్రోశిస్తూ ఉంటాడు. తా నింటికి వచ్చేటప్పటికి, ఒక్కొక్కప్పుడు మౌనంగా కూర్చొని ఏదో పుస్తకం చదువుతూ ఉంటుంది. లేదా డాబాపైకి వెళ్లి శూన్యాకాశంలోకి రెప్పలు వాల్చకుండా చూస్తూ కూర్చుంటుంది. ఆమెమౌనం, ఆ కళ్లలోంచి తనను దాటి దిగంచలాలవరకు ప్రసరించే ఆమె చూపు చూసినప్పుడు అతని అంతర్యంలో ద్వేషాగ్రహాలు విజృంభించేవి. ఒక్కొక్కప్పుడు తా నింటికి వచ్చేటప్పటికి ఏవో సభలని, సమావేశాలని వెళ్తూ వుండేది. ఆమెకు ఎదుటగా నిలబడ్డా, పక్కన కూర్చున్నా, తనకు ఆమెకు మధ్య యోజనాలదూరం ఉన్నట్టుండేది. ఆమెను తను బలవంతంగా పలకరించినా, ఆమెమాటలు హృదయస్పందం లేక కేవలం ధ్వనిమాత్రంగా తోచేవి తనకు.

ఏమహాప్రవాహంయొక్క సుదూరతీరంపైనో ఆమె నిలబడగా, తా నీవలి ఒడ్డునుంచి హీనస్వరంతో ఆమెను పిలుస్తున్నట్టుండేది. తన సాన్నిధ్యం, తన

మాటలు ఆమెముందు నిశ్చలమైన సరోవరంలో ఎవడో అవ్యక్తంగా మట్టిపెళ్లలు విసిరి, నీటి శాంతిని చెదరగొట్టినట్టుండేది. ఇది అతనికి దుర్భరం. ఆమె రూపసౌందర్యాలకు అతను వివశుడై, ఆమెకై చేతులు చాస్తాడు. కాని తన కధీనమై, తన బాహువుల్లో ఉన్న ఉమ తనకు యోజనాల దూరంలో ఉన్నట్లుండేది. ఆమెరూపం, సౌందర్యం తనవికాని, ఆమె తనది కానట్టుండేది. ఇది అతనికి దుస్సహం.

సర్వస్వమూ అయిన తనను శూన్యంగా ఎంచి, తన దృష్టి కతీతమైన ఏవీ సీమల్లోకో ఆమె తిరుగాడితే, అతని హృదయం కుమిలిపోయేది.

ఇవ్వాళకూడా ఆమె ఎప్పటిలాగానే తన ధ్యాసలోనే తానుంది. అతని రాకకు గాని, అతని చూపులకు గాని ఆమె చలించలేదు. సంఘసమస్యలను తమ జీవన్మరణసమస్యలుగా ఎంచి తర్కిస్తున్న ఆ వాదగ్రస్తురాండ్రకు ఈ పురుషుని ప్రచ్ఛన్న వేదన తెలియదు.

౨

స్నేహితురాండ్రు చర్చలు ముగించి, ఇళ్లకు వెళ్లగానే ఉమ చావడిలోనూ, భర్త గదిలోనూ అటూ ఇటూ చూసింది. "బాబుగారు బైటకి వెళ్లిపోయారు" అని పనిమనిషి చెప్పింది. కాసేపటికి ఉమ డాబామీదకు వెళ్లి, అనంతమైన శూన్యంలోకి చూస్తూ కూర్చుంది. చర్చలతో వ్యథితమైన మనస్సు కాశూన్యంలో ఏదో శాంతి! ఆచీకటిలో ఏదో తృప్తి. పగలల్లా నడిచిన బాటసారి నదిఒడ్డున సొమ్మసిలి పరున్నట్టు, ఉమ శూన్యంలోంచి వీస్తున్న చల్లని గాలికి సేదదీర్చుకొంటోంది. జీవుల సంక్షోభ, సంఘదైన్యం కల్గించిన నిస్పృహతో ఆమెహృదయం సంక్షుభితమైంది.

మళ్లీ ఈ ప్రశాంత ఏకాంతంలో ఆమెమనస్సు వైరాగ్యంలోంచి మేల్కొంది. అంతరాత్మ కన్ను తెరవనంతవరకు, కళ్లు మూసుకొని కాలం వెనక పడిపోవచ్చు. కాని అంతరాత్మ జాగృతమయాక? అనుక్షణమూ సంఘర్షణ. అనుక్షణమూ విచారణ. దారిద్ర్యమే తనకు తల్లి తండ్రులిచ్చిన కట్నమైనా, తండ్రి చెప్పించిన చదువే తనకు పెన్నిధి. భర్త చేస్తున్న పెద్ద ఉద్యోగంగాని, భర్త ఐశ్వర్యంగాని...వీటికన్న కూడ తండ్రి చెప్పించిన చదువు, ఆయనప్రబోధం... వీటినే ఆమె జీవితసర్వస్వంగా చూసుకుంటోంది. ఈ మూడేళ్లనుంచి ఎంతసేపూ పుస్తకపఠన, స్నేహితురాండ్రతో విషయగోష్ఠి—ఇవే ఆమె కానందం. మధ్యమధ్య భర్తముఖంలో ఏదో అసంతృప్తి, ఏదో అశాంతి గోచరమై ఆమెకు విచారం కలిగేది. తానే విధంగా అతన్ని కష్టపెట్టోందీ ఆమెకు తెలియదు. ప్రేమానురాగాల్లో అతను సర్వదా పరవశ మవుతూనే ఉంటాడు. కానిఅప్పుడప్పుడు తనకు తెలియనిబాధతో నిర్జీవుడై ఉంటాడు. ఇంతవరకూ అతను తన్ను అడ్డగించలేదు. అడ్డువస్తాడనే భయమూ లేదు. కాని దాంపత్యంలోలాగా తన సంకల్పాల్లో, తన అంతర్జీవితంలో కూడా భర్త సహధర్మచరుడుగా ఉంటే, తన జీవితం ఎంత ధన్యమయేది? భార్యాత్వముతో తప్ప తన వ్యక్తిత్వముతో భర్తకు సంబంధం లేదు. కాని రోజులు గడుస్తున్నకొద్దీ, ఆమెకు ఈ ఏకాంతం భారమౌతోంది. ప్రపంచముయొక్క కీకారణ్యమందు దారచూసుకొని ముందుకుపోయే శక్తిసాహసాలు ఒంటరిగా నున్న తనలో క్షీణిస్తున్నాయ్. జీవితంయొక్క ఈ పవిత్ర, అంతర్వేదికః ద్దకూడా భర్త తనతో పాణిబంధం చేస్తే? జీవితం సార్థకమయేది. పుట్టింటికి వెళ్ళినప్పుడు తల్లి అనేది "ఎందుకే నీకీ పుట్టెడు ఆలోచనలు! నలుగురిలాగా చక్కగా ఎదో ఇల్లూ, వాకిలీ భర్తనూ చూసుకొని సుఖంగా ఉండక" అని. నలుగురిలాగా! నలుగురూ సుఖంగానే ఉన్నారా? వాళ్ల అంతర్జీవితాలు ఎవరికి తెలుసు? ఎన్ని సంకల్పాలు వారి కన్నీళ్లలో నిష్ఫల మౌతున్నాయ్! తానుచూసిన వెలుగును ప్రమిదెలనిండా నింపి, ఇంటింటికీవెళ్ళి జీవి, జీవియొక్క అంతరాత్మకు అందిచ్చి వస్తే! ఆ నిర్జీవ ముఖాల్లో తేజస్సు ఉదయించదూ? వ్యక్తి, దాంపత్య జీవితాలగురించి విచారణ చేస్తూ కూర్చుంది ఉమ.

3

తీవ్రమైన అశాంతితో ఇల్లు విడిచి విహారానికని బయలుదేరాడు. కాని జనసముద్రంలో పడి ఆఉన్మత్త తరంగాల మధ్య తేలియాడుతూ వుండగా, అతని మనస్సు మళ్లీ విడిచిపెట్టివచ్చిన పంజరంకోసం పరి

తపించింది. జనపారవశ్యతకు అతడూ పులకరించి, ఉమస్పర్శకోసం ఉద్రిక్తుడయాడు. కలిగినవిద్వేషానికి ఛీత్కరించుకున్నాడు. తనకు తెలుసు-ఉమకు పుస్తకాలు, విషయాలు, చర్చలు, సభలు చాలా సంతోషం అని. చదువు, చర్చలు ముగిశాక, ఉమ తనవద్దకుఎంతో సంతోషంతో వచ్చి కూర్చుంటుంది. ఆముఖంలో, కళ్లలో ప్రతిఫలించే ప్రేమప్రసన్నతకు హర్షంతో నిండి, తాను ఆమె కౌగిలిలో తన ఈతాత్కాలిక విద్వేషాలను మరచిపోయేవాడు. ఈసారీ తాను మళ్లీ ఇంటికి తిరిగివళ్ళేప్పటికి, ఉమ ఉషస్సులా ఉంటుంది. తన హృదయం అంధకారం పోయి వెలుగుతో నిండుతుంది. గృహోన్ముఖుడయాడు. కారు యజమాని అభీష్టాన్ని తెలుసుకొని జోరుగా దూసుకుపోతోంది.

ఇంట్లో అడుగుపెట్టి లైటు వేశాడు. ఇల్లాలు డాబాపైన ఉందని పనిమనిషి చెప్పింది. అతని అలికిడి విని ఉమ కిందకు వచ్చింది. ఆమెముఖం సంతోషంతో చంద్రబింబంలా ఉంది. అతను వెళ్లినప్పుడున్న ఆలోచనాతీవ్రతపోయి ఇప్పుడు కలకలలాడుతూందోది. ఉమ ప్రసన్నముఖం, ఆనందం చూడగానే అతనివిద్వేషాని కతనే లజ్జచెందాడు. అతనికి తెలుసు - ఆమె డాబాపై కూర్చొని, శూన్యంలో బయలుదేరి అజ్ఞాత పుణ్యతీర్థాలు, అదృశ్య వుద్యానవనాలు చూసి చూసి ఆ మహదానందంతో నేలమీదికి తిరిగివచ్చి ఉంటుందని. ఆమె ఆ వుల్లాసమేఇప్పుడతన్ని మరింత పెనవైచి లాగుతూంది.

భోజనాలయాక ఉభయులూ డాబా మీదికి వెళ్లారు. మెట్లమీద మధ్యలో ఆగి కిందకు దిగి వచ్చాడు. మళ్లీ పైకి వెళ్లి డాబాగదిలో అడుగు పెట్టాడు. అప్పుడే వెలిగినదీపకాంతిలోఆమెవెన్నెల్లో మల్లెపువ్వులా ఉంది. "ఇదిగో ... సిల్కు చీర... తెచ్చాను." అని 'పాకెట్టు' పైకాగితం చింపాడు. అతని ముఖం పసిపిల్లవానిముఖంలా ఉంది. సంభ్రమంతో ఆమెపెదవులు కదలినయ్. కళ్లు తళుక్కుమన్నయ్.

"ఎన్ని కొంటారు?...ఎందు కింత డబ్బుపోసి... పదిమందికి కొత్త చీరెలు వచ్చేవి."అంది.

తమ ఇద్దరిమధ్యన ఛాయామాత్రంగా సంచున్న లోకదైన్యం చూసి అతను ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

"పదిమందిసంగతి మన కెందుకు? నీ కీ చీర చాలా బాగా ఉంటుంది." అని అతను మెల్లగా గది లోంచి వెళ్లి, పైట పక్కలో పరున్నాడు.

మబ్బుల్లోంచి అప్పుడే రెప్పలు తెరుస్తున్నాడు చందమామ. గదిద్వారంలోంచి అర్ధచంద్రుని నిశీథంలోకి అడుగుపెట్టింది ఉమ. అతనానందంతో గర్వంతో చూశాడు. ఆమె వచ్చి అతని నుదుటిపై చెయ్యి ఆన్చింది. పిల్లవాని చిలిపివేళ్లు తగిలి వీణాతంత్రులు 'జంయ్'మని మోగినట్లు, అతని నరాలన్నీ ఆ స్పర్శకు జలదరించి, రహోవాంఛలతో హోరెత్తినయ్. తలంటిపోసుకున్న జుట్టు ముడి విడి ఆమె పిరుదులదాకా పడ్డది. పొడుగాటి, వుష్కలమైన ఆ నల్లని జుట్టు గాలిలో రేగుతోంది. ఈ రూపం, ఈ సౌందర్యం, ఈ స్పర్శ...అతని కెప్పటికప్పుడే ఏదో కొత్త. ఈ వెలుగుచీకటుల దాగుడుమూతలకు ఆమె హృదయం ఎలా స్పందిస్తోందో? ఆమెకేసి మంత్రముగ్ధుడై చూస్తున్నాడు. కనులకైపు తగ్గి చూడగానే, ఆమె కనులు మూసుకొని నిద్రపోతోంది.

అంగాంగమూ జాగృతమైన అతనికి ఆ నిశ్చల ప్రశాంతనిద్రితముఖాన్ని చూడగానే తీరని వ్యథ కలిగింది. ఈ సుషుప్తురాలి సౌందర్యం, సమ్మోహనం అతన్ని పరవశం చేస్తున్నయ్. నిద్రపోతున్న ఆమెను చూస్తున్నకొద్దీ అతనికి వ్యాకులం హెచ్చింది. దుర్విధి అమృతంలో విషం చిందించింది. మళ్లీ దుఃఖ క్రోధాలతో కుమిలిపోయాడు. భగ్నహృదయంలో ద్వేషం మళ్లీ పడగెత్తింది. ఎంత అమాయకంగా నిద్రపోతోంది! ఎంత గాఢంగా! తనగుండెలో కార్చిచ్చు రగిల్చి ఈ అంతర్దహనం, ఈ అంతర్దాహం చూస్తూ. ఈమెలో ఎంత క్రౌర్యం? ఎంత హింసాపిపాస? కొలదికాలంక్రితం చల్లారిన దనుకున్న ద్వేషజ్వాలలు భగ్గున మండి శిఖరుడిని ఆపాదమస్తకం దహించివేస్తున్నయ్. తన్నిలా హింసించి, హతం చేస్తున్నందువలన ఆమెకు కలిగే ఆనంద మేమిటి? పరాభవంతో కళ్లల్లో నిప్పు రగిలింది. అప్పుడామె అతని కళ్లను చూసిఉంటే, అవి విషపాత్రలనుకునేది. ఒరలోంచి దూసిన కత్తుల్లా అతని కళ్లలోంచి చూపులు చురుక్కున దూసుకుపోతున్నాయ్.

దెబ్బతిన్న తాచుల్లా ఉన్న అతని చేతులు ఆమె నడుమును తాకినయ్. యంత్రబద్ధంగా ఆమె అతనివైపు తిరిగింది. అతనామెను హృదయానికి హత్తుకున్నాడు. ఆమెజుట్టుపై అతని చెయ్యిపడగానే, అతనిలో వాంఛ ఉప్పొంగింది. కాని ఆమె కాస్పర్శ అజ్ఞాతం. ఆమెకు నిద్రాభంగం కాలేదు. ఆమెకలలు చెదిరిపోలేదు. శరీరం అతని బాహువుల్లో ఉంది. కాని ఆమె లేదు.

ఇదే అతనికి దుస్స్వహం. ఇద్దరి మధ్య, బాహువుల మధ్య మళ్లీ యోజనాల దూరం. ఏదో మహాప్రవాహం యొక్క ఆవలితీరంపై ఆమె...ఈవలితీరంపై తాను... తమఇద్దరిమధ్య ప్రవాహం...ఆమె రూపసౌందర్యాలు.

ఆమెపై అతనికి క్రోధద్వేషాలు హెచ్చుతున్నయ్. ఆమెపుస్తకాలు...స్నేహితులు...చర్చలు ...సభలు...సమావేశాలు...ఒక్కసారిగా శూలాలై అతని హృదయంలో గుచ్చుకుపోయినయ్. మనస్సులో విపరీతమైన ఆలోచనలు చెలరేగుతున్నయ్. కొంతసేపటికి అతనికి మగతనిద్ర పట్టింది. క్రమంగా స్పృహ తప్పింది. అతని కతను తెలియదు. బహిశ్చైతన్యంపై నల్లతెరలు దిగినయ్...ఇంక తెరలవెనుక కల్లోలం...

...గదిలో పక్కలోంచి ఉమ మెల్లగా లేచి, అటూ ఇటూ చూసి, తలుపులు తీసింది. అతను కళ్లు తెరవలేదు. మెల్లగా మెట్లు దిగి కిందికి వెళ్తోంది... ఆమె. ఉమపదధ్వని అతనికి వినబడుతూనే ఉంది. వీథితలుపులు తీసిన చప్పుడయింది. మెల్లగా లేచి గదిలోంచి వెళ్లి పిట్టగోడచాటున పొంచి చూస్తున్నాడు శ్రీధరుడు. వీథిలో ఆమె తొందరతొందరగా వెళ్తోంది. శ్రీధరుడు గబగబ మెట్లు దిగి వీథిలోకి వెళ్లాడు. పరుగెత్తి ఒక్కుమ్మడిన ఆమెపై బడి హత్యచేయాలనుకున్నాడు. కాని ఆమెసంకల్పం సంపూర్ణంగా తెలుసుకోవాలనే కుతూహలం అతన్ని అవరోధించింది. వెనకాలే దూరంగా వెళ్లాడు. స్టేషన్ రోడ్డుపై ఆమె కాలుపెట్టగానే అతనిసంకల్పం తీవ్రమయింది. తన్ను విడిచి వెళ్లిపోతోంది ఉమ...ఎక్కడికో? ఎందుకో? వెళ్ళిపోవటం నిశ్చయం...గబగబా ఉద్రేకంతో నడిచాడు. సమీపించాడు...అడుగుల అలికిడి అయి, వెనక్కు తిరిగి తనను చూడగానే ఉమ క్షణమాత్రం నిశ్చేష్టురాలయింది.

"వెళ్లటానికి వీల్లేదు...పద ఇంటికి" అన్నాడు.

నిశ్చలంగా జవాబుచెప్పింది- "ఈ అధ్యాయం ముగిసింది. నేను తిరిగిరాను."

ఆమెముఖం గంభీరమైంది. నిర్భయంగా ముందు కదుగులు వేసింది.

"నీకు ప్రాణాలు దక్కవు" అన్నాడు.

"వాటిపై నా కాశలు లేవు" అంది ఉమ.

శ్రీధరుడు వెనక నడవటమేగాని కర్తవ్యం చేయలేకపోతున్నాడు. అతనిలో శక్తి క్షీణిస్తోంది. ఉమ అతనికి దూరమవుతోంది...దూరంగా రైలుకూత వినబడుతోంది. గబగబా నడిచాడు...గుండెలో రొప్పు హెచ్చింది. పరుగెత్తాడు. ప్లాటుఫారంమీదికి రైలు వచ్చింది...గంట కొట్టారు...ఆమె ఏదో పెట్టెలో ఎక్కబోతోంది. నాలుగంగలు వేశాడు. ఇంకో గంట కొట్టారు. ఆమె ఎక్కబోతోంది. పక్కనుంచి బలవంతంగా తోశాడు. తక్కున కింద పట్టాల్లోకి జారిపోయింది...రైలుచక్రాలు కదిలిపోయినయ్.

* * " *

శ్రీధరుని రెండుచేతులూగట్టిగా పట్టుకుని, "ఇదేమిటి? నాగొంతుక పిసుకుతున్నారు?" అని తన యావచ్ఛక్తితో అతని చేతులను విదల్చింది ఉమ. అతడు ఉలిక్కిపడి లేచి కంగారుగా చూశాడు. ఆమెకళ్లల్లో ప్రాణాలు లేవు. ముఖమంతా భయంతో గాంఢ్రిల్లుతోంది. అతని భయంకర నేత్రాల్లోకి చూసి, "నన్ను చంపుతున్నారు ... మీరు చంపుతున్నారు" అని అరిచింది. అతను కళవళపడ్డాడు...క్షణంక్రితం నెత్తురు మడుగుగా చూసిన ఉమ సజీవంగా తనను ప్రతిఘటిస్తోంది. అతని కేమీ బోధపడలేదు. ఏది నిజం? రైలుచక్రాలా? లేక హత్యచేయబోయిన తన చేతులా? అతనికి చైతన్యం నశించింది.

"ఉమా! ఏదో పీడకల...ఏదో దయ్యం... ఛీ...ఛీ.. భయంలేదు..." అని లేచి కూర్చున్న ఉమ తలను తన గుండెలోకి తీసుకున్నాడు శ్రీధరుడు. కాస్సేపటికి భయకంపం తగ్గి, అతని గుండెను తన తలను గట్టిగా అన్చుకొని, "ఇంకెప్పుడూ మనం ఇక్కడ పడుకోవద్దు" అంది. అతని ముఖంలో ప్రేమను, ఆతురతను చూసి, ధైర్యం చెందింది.

"నా అదృష్టం. మీరు కాబట్టి ఆ దయ్యాన్ని తోసివేయగలిగారు. లేకపోతే ఈపాటికి నెత్తురుగక్కివుందును" అని అతని రెండుచేతులను తన గుండెమీద అన్చుకుంది ఉమ.

ఆమెతలను నిమురుతూ, "పీడకల...మరిచిపో... మన నేదయ్యమూ వేరుచెయ్యలేదు." అన్నాడు శ్రీధరుడు.

కొంతసేపటికి ఆమెకు మెల్లగా నిద్రపట్టింది. కాని అతనికి పట్టలేదు. స్వప్నజాగరణల తీవ్రసంఘర్షణలతో సొమ్మసిల్లాడు. అతని అభయం తీసుకొని ఆమె నిశ్చింతగా నిద్రపోతోంది; కాని అతనికి శాంతి లేదు. సుఖం లేదు. నిద్ర లేదు.

ఏదో భయంకర నాటకం ఆడుతున్న రంగస్థలంలో ఉన్నాడతను. తెరలను తొలగించు...భయానకం. తీపిమాటల వెనుక రక్తదాహంతో తపించే తేనె పూసిన కత్తు లెన్ని? ప్రసన్నత చూపే నేత్రాల్లో కలుగులందు దాగిన నల్లతాచు లెన్ని? ప్రతివాడూ ఒక రంగస్థలం...నేపథ్యంలోనే నిజ నాటకం!

౪

తన అంతర్యంయొక్క అవ్యక్త, రహస్య అభీష్టానికి శ్రీధరుడు దుఃఖించాడు. అతని కళ్ల ముందు రైలుచక్రాలు...వాటిలో చిక్కుకొన్న ఉమ...నెత్తురు చిమ్మిన తన కళ్లు పోవట్లేదు. ఉమ తన చేతులను గట్టిగా విదల్చకపోతే, తాను హంతకుడయేవాడు—తనకు తెలియకుండా. తనను చూసి తానే భయపడ్డాడు. తన ద్వేషం ఇలా మహావిషసర్పమై బుసలుకొట్టుతోందని అతనూహించలేదు. రాత్రి అన్నా, నిద్రఅన్నా విపరీతభయం కలిగింది. ఉమను కింద పడుకోమని, తాను పైగదిలో పడుకుంటున్నాడు. ఇలా విడిగా పడున్నా, అతని వ్యాకులం తగ్గలేదు. మధ్యమధ్య నిద్రలో లేచి, గంటలకొద్దీ మేల్కొనివుంటున్నాడు. కద్దనుకున్నా, ఉమ పుస్తకాల అలమరలు...స్నేహితులు...చర్చలు...సభలు...అభయంకరమైన హత్యాదృశ్యం కళ్లముందు పదేపదే గోచరిస్తున్నయ్. తన అంతర్యం ఉమ తెలుసుకుంటే? తనలో రగులుతున్న చిచ్చు ఆమె చూడగలిగితే? ఆమె తన గోష్ఠిని మరచి, తననే సర్వస్వంగా ఎంచుకుంటే? తనకీ అసంతృప్తి, ఈ ద్వేషం ఉండవు.

భర్తలో కనబడుతున్న మార్పు ఉమ కర్థంకాలేదు. అతని ఆదరాభిమానాల్లో లోటు లేదు. కాని ముఖంలో అంతర్వ్యాకులంయొక్క విషాదచ్ఛాయలు స్పష్టంగా కనబడుతున్నయ్.

నిద్రపట్టక మెల్లగా డాబామీదకు వెళ్లింది. నిశ్శబ్దంగా వచ్చిన ఆమెను చూడగానే అత నులిక్కిపడ్డాడు. శ్రీధరుడు నిద్రపోవటం లేదు. దీపం వెలుగుతూనే ఉంది. అంత నెంత ప్రయత్నించినా, తన్నుతా సంబాళించుకోలేకపోయాడు. ముఖం కళావిహీనమై, కళ్లు విచారభారంతో ఉన్నయ్.

"ఇక్కడ...ఇలా...ఒంటరిగా నిద్రలేకుండా" అంది ఉమ.

శ్రీధరుడు మాట్లాడలేదు.

"క్షమించండి...నే నేమైనా కష్టం కలిగిస్తే" అని అన్నది మళ్లీ ఉమ.

ప్రయాసతో - "ఛా......క్షమించటానికేముంది? నువ్వు కష్టం కలిగించటమేమిటి? ఏమీ లేదు" అన్నాడు.

"కాదు. నన్నిలా బాధించవద్దు." అంది ఉమ.

కాసేపటాక అతను ఉమచేతులను తన చేతుల్లోకి తీసుకొని, "ఉమా" అన్నాడు.

ఆమె అతనికళ్లలోకి చూసింది.

"ఉమా! నే నెప్పుడింటికి వచ్చినా, ఇంట్లో వున్నా, ఎప్పుడూ ఏదో పుస్తకాల్లో మునిగి ఉంటావు...స్నేహితులతో చర్చిస్తూ ఉంటావు. సభలూ...సమావేశాలూ...డాబాపైకి వస్తే శూన్యాకాశంలోకి చీకట్లో, వెన్నెల్లో మౌనంగా గంటలకొద్దీ చూస్తూ కూర్చుంటావు...సముద్రానికి వెళ్తే ఆ అలల ఆటుపోట్లు వింటూ నిన్ను నువ్వు మరచిపోతావు. నువ్వు నాకు సర్వస్వం...ఉమా...కాని...కాని...నేను నీకు సర్వస్వం కానూ?" అన్నాడు శ్రీధరుడు.

ఆమె నిర్ఘాంతపోయి, నిశ్చేష్టురాలైంది. కళ్లు తక్కున దీపా లారినట్టున్నయ్. దీర్ఘనిశ్వాసాలతో ఆమెగుండె బరువెక్కింది. విన్న ప్రతిమాటా బాణంలా గుచ్చుకపోయింది అంతరాత్మలో. తన తలను అతని హృదయానికి ఆన్చుకుంది. ఆమె తప్తాశ్రువులకు అతని హృదయతాపం ఒకింత చల్లారింది.

౫

"ఏం...అమ్మగారు...పుస్తకాలు ఇక్కడనుంచి తీసేస్తున్నారేం?" అని అడిగింది పనిమనిషి.

ఉమ జవాబివ్వలేదు. ఒక్కొక్క పుస్తకం తీసి మూలగదికి పంపుతుంటే, ఆమెకళ్లలో కలుగు

తున్న కలవరం పనిమనిషి చూస్తూనే ఉంది. కాని ఈ అశ్రుగాథ దానికి తెలియదు. యజమానురాలు చదువుకొన్నదని, అందమైనదని గర్వపడేది. కాని ఈనాడు పుస్తకాలు కొట్టుగదికి చేరుకుంటున్నయ్. హఠాత్తుగా కళ్లు గిర్రున తిరిగి, ఉమముఖం ముది పెక్కినట్టుంది.

ఉమఅస్వస్థత స్నేహితురాండ్రకూ అర్థం కాలేదు. తమకు ఎంతో చేయూతిగా ఉంటున్న ఉమ ఇలా దారిపక్కన ఎందుకు నిలబడి, కూలబడి పోయిందో వాళ్లకూ బోధపడలేదు. క్రమేపీ వారి రాకపోకలు తగ్గిపోయినయ్.

సభలూ, సమావేశాల్లో ఉమ కన్పించల్లేదు.

మూలగదిలో తాళాల బీరువాల్లో పుస్తకాలు యావజ్జీవఖైదీల్లా ఉన్నయ్.

అప్పుడప్పుడు మధ్యాహ్నం ఉమ మూలగది తలుపు తీసి, బీర్వాల దగ్గర కుర్చీలో కూలబడిపోయేది. పనిమనిషి వచ్చి, "అమ్మా...ఈ ఉక్కలో...... చీకట్లో...ఏమిటి......నేను పుస్తకాలు తెస్తాను... పదండి...సావడిలోకి" అనేది. కాని మెల్లగా లేచి గదితలుపులు తాళంవేసి, వెళ్ళి మంచంలో పడుకునేది గోడకున్న భర్తఫోటోకేసి చూస్తూ.

భర్తఇంట్లో ఉన్నంతసేపూ...అతనితోకబుర్లు, ముచ్చటలు...నవ్వులు...ఆఫీసునుంచి తిరిగి ఇంటికి రాగానే చక్కగా అలంకరించుకుని స్వాగతమిచ్చేది ఉమ. ఉభయులూ కలసి బీచికో, క్లబ్బుకో వెళ్లేవారు. తిరిగివచ్చి, డాబాపై, ఉమకౌగిలిలో శ్రీధరుడు నిశ్చింతగా నిద్రపోయేవాడు.

ఉమముఖం మాసి, పనిమనిషి చెప్పింది:

"బాబుగారూ! అమ్మగారి సంగతి మీరు చూడల్లేదు...చూడండి...ఆముఖం...నానాటికీ చిక్కిపోతున్నారు. డాక్టరును పిలవండి." అని.

శ్రీధరునికీ తెలుసు. ఉమముఖంలో ఇప్పుడా మనోహరసౌందర్యం, సమ్మోహనం లేవు. ఆకళ్లలో అతని కతీతమై, అతిలోకమైన ఆచూపు లేదు. రోజు రోజుకూ కృశిస్తోంది. ప్రాణం లేని నిర్జీవప్రతిమలా ఉంది. ఆ మనోజ్ఞ, ఉజ్వలరూపం పోయి, పిండి బొమ్మలా ఉంది. వైద్యులూ చప్పరించారు. మందు లేదన్నారు.

శ్రీధరుడు ఆఫీసునుంచి తిరిగివచ్చేప్పటికి బాగా చీకటిపడ్డది. అతని కళ్లముందిప్పుడు దీపరేఖ మెరవల్లేదు. దీనముఖి కనబడుతోంది.

"ఇంత చీకట్లో ఎలా ఉన్నావు...ఉమా" అని లైటువేసి దగ్గరకు వెళ్లాడు.

బల్లిలా మంచాన్ని అంటిపెట్టుకొనివుంది ఉమ. తన రెండు శుష్కహస్తాలతో అతనిముఖాన్ని నిమిరింది. సంతోషం చూపటానికి కళ్లు ప్రయాసపడినయ్. కాని అక్కడ వెలుగు ఆరిపోయింది.

"ఇంత ఆలస్యంగా వస్తే ఎలా? నాకేం తోస్తుంది?"

అని అన్నది ఉమ. పెదవులపై తటిత్తు మన్న దరహాసం విషాదంలో వెలవెలపోయింది.

శ్రీధరుడు మెల్లగా ఆమెను డాబామీదికి తీసుకువెళ్ళి, పక్కవేసి పడుకోబెట్టాడు.

ఆమెపక్కనే కూర్చొని, "ఉమా! వళ్లంతా పాలిపోయింది. ముఖం నిరుత్సాహంగా నిర్జీవంగా ఉంది. ఎప్పుడైనా ఇలా ఉన్నావా? నీ ఆరోగ్యం పాడైంది...ఆఅందంలేదు ఇప్పుడు." అని అన్నాడు.

కొలదినిమిషాలు గడిచాక, అతని చేతులను తన దుర్బలహస్తాల్లోకి తీసుకొంది. అతని వ్యాకులిత ముఖాన్ని చేతులతో తడిమింది. హీనస్వరంలో ఉమ-

"ఉహూ! ఉత్సాహం...జీవం...ఆరోగ్యం... అందం..." అని తీవ్రమైన ఆయాసంతో, "ఇవన్నీ... ఎందుకు నాకు...మీరే నా సర్వస్వం" అని అతని చేతులను తన గుండెమీదకు తీసుకుంది.